

# వెన్నెలదీపాలు

## – డా.యండమూరి వీరేంద్రనాథ్

*(యండమూరి వీరేంద్రనాథ్ గారి రచనాశైలి గురించి పాఠకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చెప్పే అంశం ఏదైనా, మనసుకి హత్తుకునేలా, మనసుల్ని కదిలించేలా అక్షరరూపం ఇవ్వడం యండమూరిగారి ప్రతి రచనలోనూ స్పష్టంగా కన్పిస్తుంది. ఆయన వ్రాసిన 'విజయానికి ఆరో మెట్టు' పుస్తకంలోని చిన్నచిన్న సంఘటనలను ప్రతినెలా మీకందిస్తున్నాము. ప్రతి సంఘటనా ఏదో ఒక నిత్యజీవితసత్యంపై వెలుగులు ప్రసరింపచేస్తుంది.. అన్నీ కలిపి వెన్నెలదీపాల్లా మన మనసుల్ని వెలిగిస్తాయి. వీరేంద్రనాథగారి ప్రత్యేక అనుమతితో ఈ చిన్న కథలు కౌముది పాఠకులకోసం..)*

*(గత సంచిక తరువాయి)*

<u>విమర్శకులపై విమర్శ</u>

తులసీదళం మీద వచ్చినట్టే విశ్వనాథవారి 'బాణావతి' పైన కూడా క్షుద్రసాహిత్యమని విమర్శలు చెలరేగాయి. దానికా కవిసామ్రాట్ చెప్పిన సమాధానం ఆయన మాటల్లోనే చదవండి.

విలేఖరి: మీ 'బాణావతి' ప్రజాదరణ పొందినమాట నిజమే. కానీ దానిపై శ్రీవాత్సవ ప్రభృతుల విమర్శలకు మీ సమాధానం ఏమిటి?

విశ్వనాథ: పత్రికలలో నేనెవరి విమర్శలకీ సామాన్యంగా సమాధానం ఇవ్వను. శ్రీవాత్సవను నేను సాహితీవేత్తగానూ, గ్రంథ విమర్శకునిగానూ అసలు పరిగణించడంలేదు. బాణావతి ఉంది. అందులో ఒక యథార్థగాథను చిత్రించాను. అట్టివి మన దేశంలో బోలెడు జరిగాయి. విదేశాలలోనూ జరిగాయి. ఆయా దేశాలలో అట్టి కథలపైన చక్కని గ్రంథాలు వచ్చాయి. విక్టర్ హ్యూగో 'వెర్ వుల్ఫ్' ఇట్లాంటి నవలే. అమెరికానుండి 'వీర్డు కథలు' అనే మాసపత్రిక వస్తుంది. లక్షలమంది దానిని చదివి ప్రశంసిస్తారు. అందులోనివి ఈ కథలే. 'డ్రాకులా' అనే నవల ఒకటి ఉంది భీభత్సం ప్రధానరసంగా, ఈ నవల వాళ్ళ దేశంలో గొప్ప సాహిత్య సృష్టి క్రింద అంగీకరింపబడింది. బాణావతిలో ఉన్నదీ అట్టి రసమే. ఆ రసజ్ఞానంలేని మనుష్యులు దానిని విమర్శిస్తే మనదేం పోయింది?

ఒక చోట ఆటంబాంబు పడింది. భయంకరమైన దృశ్యం అది. దానిని వర్ణించడం జరిగింది. అక్కడ భీభత్సం రససిద్ధ పొందిందన్నమాట. ఇదేమి తప్పు? ప్రతి మానవుని హృదయంలో వారికి హత్తుకునే వివిధ రసాలుంటాయి. గ్రంథం చదివినప్పుడు ఆ స్థాయి రసంగా సిద్ధిని పొందుతుంది. ఇదే కవి చేసే పని. బాణావతిలోనూ ఆ పని జరిగింది. అలాంటప్పుడు ఇంగ్లీషువాడూ, అమెరికన్ వాడూ వ్రాసిన నవల నచ్చి, నా బాణావతి నచ్చలేదంటే, దానికి నేనేమీ జవాబివ్వనక్కరలేదు.

ఇలాంటి విమర్శకులుండ బట్టే వారికి గౌరవం లేకుండా పోంది. అందుకే ఈ ప్రపంచంలో రచయితల జ్ఞాపక స్థూపాలున్నాయి. చివరికి ఏ మాత్రం మంచి చరిత్రలేని కొందరు రాజకీయ నాయకులకి కూడా వున్నాయి. కానీ విమర్శకుడి పేరు మీద ఒక్కటి కూడా లేదు.

"మాకు స్థాపాలు అవసరం లేదు. సాహిత్యాన్ని మా భుజాల మీద వేసుకుని మోస్తాం" అనుకుంటూ సంతృప్తిపడుతూ వుంటారు వారు. వారికి తెలియని విషయం ఏమిటంటే సాహిత్యం ఎవరి భుజాల మీద ఆగదు. అది నడుస్తూనే వుంటుంది.

**కొత్త రకం కష్టం**

కష్టాలు రకరకాలు. ఒకరికి కేన్సర్ అయితే, మరొకరికి బద్ధకం రోగం. అదే విధంగా కొందరు స్త్రీలకు భర్తనుంచి, మరికొందరికి ఎక్కువైన డబ్బు నుంచీ కష్టాలు రావొచ్చు.

ఇరాన్‌లో ఒక భార్య కోర్టుకి వెళ్ళింది. భర్త రోజూ కొడుతూ వుంటాడని, పదిహేను రోజులకొకసారి మాత్రమే కొట్టే అధికారం అతడికిస్తూ, తనని రక్షించమని కోర్టువారిని కోరుకుంది. తనని కొట్టటం తప్ప అతడిలో మరే దుర్గుణమూ లేదనీ అందువలన అతనిని తాను వదిలిపెట్టలేననీ చెప్పింది. భర్తమాత్రం, "మొగవాడు అధికారం నిలుపుకోవాలంటే భార్యని అలా కొడుతూ వుండాల"ని ధీమాగా చెప్పాడు.

ఒకరోజు కూడా కొట్టవద్దని కోర్టు సలహా ఇచ్చిందనుకోండి. అది వేరు సంగతి. ఇంతకీ, రోజులు గడుస్తున్న కొద్దీ మనం మారుతున్నామా లేదా?

నాగరికత వేరు, సంస్కృతి వేరు అని మనం ఎప్పటికి తెలుసుకుంటాం? అందుకే 'ముత్యమంత పసుపు ముఖమంత ఛాయ..కోటి బంగారు కాసులెవరింటనుండు? అరుగులలికే వారి అరచేతనుండు' అన్న పాటలు వచ్చే తరానికి చాలా గమ్మత్తుగా, కొత్తగా వుంటాయి. అర్థం తెలీక చాలా కన్‌ఫ్యూజ్ అవుతారు.

***ఉచితంగా (తోట) పని***

"కామెడి అంటే కొంత కాలం క్రితం జరిగిన ట్రాజెడీ" అన్నాడు గ్రూచో మార్క్స్ (1895 - 1977). ఆ రోజుల్లో అతడొక గొప్ప కమేడియన్. అప్పటికప్పుడు సమయస్ఫూర్తితో జోకులు వేయటం ఇతడికి వెన్నతో పెట్టిన విద్య. "క్లోజప్‌లో మన ట్రాజెడీ, లాంగ్ షాట్‌లో మన కామెడీగా కనపడుతుంది" అన్నది కూడా ఇతడే ఈ పుస్తకంలో 'బ్రహ్మానందము' గురించి ప్రసక్తి వున్నది. బ్రహ్మానందంలో మంచి పడక సుఖం కూడా ఒకటిట. దాని గురించి గ్రూచో ఒక జోకు చెప్పాడు.

గ్రూచో ఒకరోజు తన ఇంటి ముందు తోటలో పనిచేసుకుంటున్నాడు. రోడ్డుమీద వెళ్తూన్న మధ్య వయస్కురాలు ఆ తోట అందానికి ముచ్చటపడి "ఈ తోటకి మాలివి నువ్వేనా?" అని అడిగింది.

"అవును" అన్నాడు గ్రూచో.

"చాలా అద్భుతంగా వుంది, మా ఇంటికొచ్చెయ్యి. మంచి జీతం ఇస్తాను."

గ్రూచో ఆమెవైపు ఇబ్బందిగా చూసాడు. అతడి ఇబ్బందిని మరోలా అర్థం చేసుకుని, "చెప్పు ఇక్కడ నీకు వీళ్ళు ఎంత ఇస్తారు? దానికి రెట్టింపు ఇస్తాను" అంది గర్వంగా.

గ్రూచో నమ్రతగా, "మా ఆవిడ ప్రతిరాత్రీ తన పక్కమీద నన్ను పడుకోనిస్తుంది" అన్నాడు.

## మార్పు మన తీర్పు

ఒక పెద్ద బోనులో అయిదు కోతుల్ని పెట్టండి. పైన అరటిపండు వేలాడదీయండి. దాన్ని అందుకోవటానికి ఒక కోతి ప్రారంభించగానే నీటి పైపుతో బలంగా అన్నిటినీ తడపండి. ఇలా నాలుగయిదు సార్లు చేసాక, ఇక కోతులు అటువైపు వెళ్ళే సాహసం చెయ్యవు.

ఇప్పుడు వాటిలో ఒక పాత కోతిని తీసేసి కొత్తదాన్ని పెట్టండి. ఇక చూడండి.

అది అరటిపండు వైపు వెళ్తూంటే మిగతావి భయంకరంగా దానిమీద పడి క్రిందకి లాగేస్తాయి. నీళ్ళు పడకపోయినా సరే.

ఇప్పుడు పాత నాలుగు కోతుల్లో ఒకదాన్ని తీసేసి, రెండో కొత్తదాన్ని చేర్చండి. అది అరటి పండువైపు వెళ్తూండగా, దాన్ని వెనక్కి లాగేసే కార్యక్రమంలో మొదటి కొత్త కోతి కూడా ఉత్సాహంగా పాల్గొంటుంది. ఇలా వరుసగా కోతుల్ని మారుస్తూ పొండి. అయిదో (కొత్త) కోతిని క్రిందకి లాగేసే నాలుగు (కొత్త) కోతులకీ కూడా "తామెందుకు ఆ పని చేస్తున్నాయో" తెలీదు.

ఆ తరువాత అయిదు అరటి పండు వైపు వెళ్ళే ధైర్యం చెయ్యవు.

ఎందుకు?

ఎందుకంటే .. అదంతే.

మన మూఢనమ్మకాలన్నీ ఈ విధంగానే నిర్మింపబడ్డాయి.

("తప్పు చేద్దాంరండి" నుంచి)

## కృష్ణుడు - ఇద్దరు రాధలు

చాలామంది మనుష్యులు తాము మార్చుకోగలిగే విషయాల్ని మార్చుకోలేమనీ, మార్చుకోలేని విషయాలపట్ల తాము మారలేమనీ అనుకుంటూ, తమ ఫెయిల్యూర్‌కి అసలు కారణం తెలుసుకోకుండా దిగులు చెందుతారు.

ఒక పన్నెండో క్లాసు విద్యార్థి ఉత్తరం రాస్తూ, తనకి జ్ఞాపకశక్తి తక్కువైందనీ, నల్గొండ నుంచి హైదరాబాద్ వచ్చాక ఏకాగ్రత కుదరటంలేదని తెలియబర్చాడు.

నల్గొండలో ఒకమ్మాయి 'మనసంతా నువ్వే, నువ్వు లేక నేను లేను, ప్రాణం' మొదలైన పేపర్ కట్టింగులు అంటించి అతడికి కన్నీటి వీడ్కోలు ఇచ్చిందంట. ప్రస్తుతం హైదరాబాద్‌లో మరో పదోతరగతి అమ్మాయి కళ్ళు ఆరాధనా పూర్వకంగా తననే చూస్తున్నాయి. అతడికి ఏం నిర్ణయించుకోవాలో తెలియటంలేదు. చదువుమీద ఏకాగ్రత మాత్రం నిలవటంలేదు. అదీ సమస్య.

ఇది వయసు, వాతావరణం తప్పు నిజమే. కానీ ఏకాగ్రత నిల్వక పోవటానికి కారణాలు విశ్లేషించుకోవలసిన బాధ్యత కూడా వున్నది కదా. ఇటువంటి సందర్భాల్లో కూడా అయిదు కోతుల కథ వర్తిస్తుంది.

## అందరూ నన్నే చూస్తున్నారు

ఇతరుల ప్రవర్తనపై మన నిర్ణయాలు ఆధారపడి వుండనవసరంలేదు.

ఒక అమ్మాయి రైల్వే స్టేషన్ దగ్గిర ఆటో దిగింది. ఒక్క సూట్ కేసూ, బరువైన బ్యాగూ ఉన్నాయి. రైలు కదలటానికి సిద్ధంగా ఉంది. వేగంగా వెళ్తే అందుతుంది. కూలీలు ఎవరూ లేరు. ఎవర్నన్నా కాస్త సాయం చెయ్యమని అడిగితే, తరువాత అడ్వాంటేజి తీసుకుంటారేమో అన్న భయం. రైలు కూత పెట్టింది. రెండు చేతుల్తోనూ రెంటినీ పట్టుకుని బరువుగా వంగుతూ ప్లాట్ ఫారం మీద

పరిగెడ్తే, అందరూ నవ్వుకుంటారని బిడియం. అప్పటికే అందరూ సానుభూతిగా చూస్తున్నారన్న అనుమానం. దాంతో, తానొచ్చింది అసలా రైలు కోసం కాదన్నట్టుగా స్టేషన్‌లోకి అడుగుపెట్టి, నెమ్మదిగా నడవటం ప్రారంభించింది. ఈలోపులో రైలు కదిలి వెళ్ళిపోయింది.

రోడ్డుమీద వర్షం నీటిలో మీరు దభిల్లున పడ్డారు. కష్టపడి లేచారు. దుస్తులకి బురద అంటుకుంది. చుట్టూవున్న వారిలో ఒకరిద్దరు 'అయ్యో' అన్నా మొత్తం అందరి మొహాల్లో ముసిముసి నవ్వులే. ఒక్కసారి వారి మొహాల్లోకి చూస్తూ మీరూ నవ్వెయ్యండి. మీ ప్రతి స్పందన (REFLEX ACTION) అర్థంకాక విస్తుపోతారు. మీ పన్ను మీరు చేసుకోవచ్చు.

***కొండ చిలువతో యుద్ధం చేయటం ఎలా?***

వియత్నాం అడవుల్లో కొండ చిలువలు ఎక్కువ. ముప్పై అయిదు అడుగుల పొడవుండే ఈ పాములు, మనిషిని అరటి పండుతిన్నట్టు నిలువునా మిగేస్తాయి. అలాంటి కొండచిలువలు ఎదురుపడ్డప్పుడు ఏం చెయ్యాలో అమెరికన్ సైనికులకి వియత్నాం యుద్ధంలో ఈ విధంగా నిర్దుష్టమైన సూచన్లు ఇవ్వబడ్డాయి.

1. అది ఎదురుపడ్డప్పుడు పరుగెత్తకు. నీకన్నా వేగంగా అది చెట్ల మధ్య పాకుతూ రాగలదు.

2. రెండు కాళ్ళనీ మెలికవేసి, నడుముకి చేతులు దగ్గిరగా పెట్టుకుని వెల్లకిలా పడుకో.

3. నిన్ను వాసన చూసుకుంటూ అది మొహం వరకూ వస్తుంది. కదలకు.

4. నిన్ను పూర్తిగా పరీక్షించిన తరువాత, కాళ్ళనుంచి ప్రారంభించి పై వరకూ మింగుతూ వస్తుంది. భయపడకు.

5. నీ శరీరం అంతా గంజిలాంటి ద్రవంతో దుర్గంధ భూయిష్టమవుతుంది. నిశ్చలంగా వుండు.

6. కదిలావో, అనుమానం వచ్చి అది మెలి తిరుగుతుంది. సగానికి విరిగిపోతావు.

7. భుజాల వరకూ నువ్వు లోపలికి వెళ్ళాక, అప్పటివరకూ చేతిలో దాచి పెట్టుకున్న చురకత్తిని ఎత్తి దానిపై అంగిట్లో గుచ్చు. మెదడుని చీలుస్తూ అది నీతోపాటూ లోపలికి వెళ్తుంది.

8. అడవిలో ఎదురైన కొండ చిలువ బారినుంచి బయట పడటానికి మరో మార్గం లేదు. అందుకే నీ వద్ద ఎప్పుడూ ఒక చురకత్తి ఉంచుకో. అది నిరంతరం పదునుగా ఉండేట్టూ చూసుకో.

ఆ చురకత్తే యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం. దేనికి ఏడవకూడదో, దేనికి భయపడకూడదో తెలుసుకోవటమే యుక్తాయుక్తం. ఆ యుక్తాయుక్త పరిజ్ఞానమనే చురకత్తికి ఎలా పదునుపెట్టాలో భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు మనకి చెప్పాడు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments